# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 8 । జూన్ । 2023






**చీనీ టన్ను రూ.38,500**

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38,500 పలికాయి. మార్కెట్‌కు 934 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



**వాన కబురు**

రానున్న 5 రోజుల్లో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. ఉష్ణోగ్రతలు కూడా బాగా తగ్గే అవకాశం ఉందన్నారు.

గరిష్టం/కనిష్టం
**40.2°/23.4°**

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

## న్యూస్‌రీల్

### హౌరా- ప్రశాంతి నిలయం మధ్య ప్రత్యేక రైళ్లు



**గుంతకల్లు:** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 7, 9 తేదీల్లో హౌరా – పుట్టపర్తి ప్రశాంతి నిలయం మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు డివిజన్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 7వ తేదీ మధ్యాహ్నం 3.55 గంటలకు హౌరా జంక్షన్ నుంచి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు (22831) బయల్దేరి 8వ తేదీ రాత్రి 9.30 గంటలకు ప్రశాంతి నిలయం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 9 వతేదీ ఉదయం ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు (22832) ఉదయం 7.55 గంటలకు బయల్దేరి 10వ తేదీ మధ్యాహ్నం 1.15 గంటలకు హౌరా చేరుతుంది. ఈ ప్రత్యేక రైళ్లు జిల్లాలోని గుత్తి, అనంతపురం, ధర్మవరం మీదుగా పుట్టపర్తి ప్రశాంతి నిలయం చేరుతాయన్నారు.

### బీజేపీ నాయకుడు దేవానంద్‌పై కేసు


**కదిరి టౌన్:** బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్‌పై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గుడిసె దేవానంద్ 2019లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నందిశెట్టి బాబు నుంచి రూ.9 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. గడువు తీరినా డబ్బులివ్వకపోవడంతో నందిశెట్టి బాబు నిలదీయడంతో దేవానంద్ అతన్ని దుర్భాషలాడారు. దిక్కున్న చోట చెప్పుకో అంటూ దౌర్జన్యం చేశాడు. దీంతో నందిశెట్టి బాబు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. తనను గుడిసె దేవానంద్ మోసం చేశాడని, అతని వల్ల తనకు ప్రాణహాని ఉందని బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దేవానంద్‌పై ఐపీసీ 420, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు తెలిపారు.

### 'పది' పరీక్షలకు 1,040 మంది గైర్హాజరు

**ప్రశాంతి నిలయం:** జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ సైన్స్ పరీక్షకు 1,040 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని 58 కేంద్రాలలో పరీక్ష నిర్వహించగా 6,569 మందికిగాను 5,529 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. ధర్మవరం, పెనుకొండ పరీక్ష కేంద్రాలను సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణ పరిశీలించారు.

### మరణశయ్య నుంచి ముగ్గురికి ప్రాణం

- అవయవదానంతో ఎందరికో ఆదర్శంగా నిలిచిన తిప్పమ్మ



తిప్పమ్మ (ఫైల్)

**అమరాపురం:** అనారోగ్యంతో బాధపడే వారు ఎలాగైనా కోలుకోవాలనుకుంటారు. వైద్యులే లాభం లేదని చెప్పినా.. బతికేందుకు పెద్దపోరాటమే చేస్తారు. అలాంటి పరిస్థితుల్లోనూ ఓ మహిళ ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. తాను ఆరిపోతున్న దీపమని తెలిసీ మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపింది. వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని బసవనపల్లి గ్రామానికి చెందిన వీరసేనప్ప భార్య తిప్పమ్మ (52) గుండె జబ్బుతో బాధపడుతుండగా, కుటుంబీకులు ఇటీవల బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు బతకడం కష్టమని తేల్చేశారు. ఇదే విషయాన్ని తిప్పమ్మకూ చెప్పి అవయవదానం గురించి అవగాహన కల్పించారు. దీంతో ఆమె అందుకు సమ్మతించి సంతకం చేసింది. బుధవారం ఆమె తుదిశ్వాస విడవగా, వైద్యులు వెంటనే భర్త వీరసేనప్ప, కుమారుడు నగేష్‌ల నుంచి సంతకాలు తీసుకుని వారి అంగీకారం మేరకు తిప్పమ్మ కిడ్నీ, రెండు కళ్లు, చర్మాన్ని సేకరించారు. వాటిని అవసరమున్న ముగ్గురికి వెంటనే అందజేయనున్నట్లు తెలిపారు. జీవితం ముగిసే దశలోనూ మంచి నిర్ణయం తీసుకుని ఎందరికో ఆదర్శంగా నిలిచిన తిప్పమ్మను, అందుకు సమ్మతించిన వారి కుటుంబీకులను మండల ప్రజలు అభినందిస్తున్నారు.

### వీఆర్‌కు కానిస్టేబుల్

**హిందూపురం:** స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సురేష్‌బాబును వీఆర్‌కు పంపుతూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ సురేష్ బాబుపై భార్య శిరీషా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో సురేష్‌బాబు అక్కడే విధుల్లో ఉంటే కేసును పక్కదారి పట్టించే అవకాశం ఉండడంతో అతన్ని వీఆర్‌కు పంపినట్లుగా తెలిసింది.

వేరుశనగ విత్తనం పేరు చెబితే వెంటనే గుర్తొచ్చేది కదిరి పరిశోధన స్థానమే. ఇక్కడ అభివృద్ధి చేసిన వేరుశనగ రకాలు 'కే' పేరుతో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సాగవుతున్నాయి. అందుకే జాతీయంగా గుర్తింపు తెచ్చుకుంది. ఇక్కడి శాస్త్రవేత్తలు తెగుళ్లు, బెట్టను తట్టుకునే నూతన వంగడాలను ఆవిష్కరిస్తుండగా దేశంలోని వివిధ రాష్ట్రాల రైతులు కదిరి రకాలకే మొగ్గుచూపుతున్నారు.

# కదిరి విత్తు.. సూపర్ హిట్టు



- రైతుకు మేలు చేస్తున్న కదిరి పరిశోధన స్థానం
- జాతీయంగా గుర్తింపు పొందిన వేరుశనగ రకాలు
- విత్తనోత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానం
- కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు



కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రం

**కదిరి:** కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రం దేశానికే తలమానికం. ఇక్కడ ఉత్పత్తి చేసిన వేరుశనగ కొత్త రకం వంగడాలు దేశ వ్యాప్తంగా ఎన్నో రాష్ట్రాల్లో సాగులో ఉన్నాయి. ఇప్పటి దాకా 15 రకాల వేరుశనగ విత్తన వంగడాలు ఈ పరిశోధన స్థానం నుంచి విడుదలయ్యాయి. బెట్టను బాగా తట్టుకునే కదిరి–6(కే–6), కే–9, కదిరి హరితాంధ్ర, కదిరి లేపాక్షి రకం వంగడాలు బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇవి ఎకరాకు 40 నుండి 50 బస్తాల దిగుబడి ఇస్తున్నాయి. వచ్చే రెండేళ్లలో మరో రెండు కొత్త రకం వంగడాలు విడుదల చేసేందుకు ఇక్కడి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు.

**దేశంలోనే మొదటి స్థానం**

కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధి చేసిన విత్తనాలకు దేశ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. ఈ క్రమంలోనే 2022వ సంవత్సరంలో అత్యధికంగా విత్తనోత్పత్తి చేసినందుకు గానూ ఈ పరిశోధన స్థానానికి దేశంలోనే మొదటి స్థానం దక్కింది. ఇటీవల గుజరాత్‌లోని జునాఘడ్‌లో జరిగిన దేశ వ్యాప్త వ్యవసాయ శాస్త్రవేత్తల సమావేశంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ టీఆర్ శర్మ చేతుల మీదుగా కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.సంపత్‌కుమార్ ఈ అవార్డును అందుకున్నారు.

**'అనంత' నుంచి జిల్లాకు తరలింపు**

ఇప్పుడున్న కదిరి వ్యవసాయ పరిశోధన స్థానాన్ని తొలుత ప్రాంతీయ నూనె గింజల పరిశోధన కేంద్రం పేరుతో 1954లో అనంతపురంలో ఏర్పాటు చేశారు. అనువైన వాతావరణ పరిస్థితులు, తగిన నేలకోసం 1959లో కదిరికి తరలించారు. 1982లో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధం చేశారు. 1985లో పూర్తిస్థాయి పరిశోధన కేంద్రంగా మార్చారు. 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పరిశోధన కేంద్రంలో ఎంతోమంది వ్యవసాయ శాస్త్రవేత్తలు నిరంతరం శ్రమిస్తుంటారు. ఒక కొత్తరకం విత్తన వేరుశనగ వంగడాన్ని విడుదల చేయడానికి ఇక్కడి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఏడెనిమిది సంవత్సరాల పాటు కష్టపడతారు.

**కాగితాల్లోనే 398 ఎకరాల కేటాయింపు**

చంద్రబాబు హయాంలో విత్తనోత్పత్తి కోసం కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రానికి అనుబంధంగా ఎన్‌పీ కుంట మండల పరిధిలో 398 ఎకరాల భూమిని 2014లో కేటాయించారు. దాని అభివృద్ధి కోసం అప్పట్లో రూ.3 కోట్లకుపైగా నిధులు కూడా ఖర్చు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. కానీ అక్కడ వాస్తవ పరిస్థితిని గమనిస్తే ఆ భూమి పూర్తిగా పెడబల్లి రిజర్వాయర్ నీటిలో మునిగిపోయింది. కేవలం కాగితాల మీదనే భూమి కేటాయింపు, నిధుల ఖర్చు కనబడుతోంది.

**వైఎస్సార్ హయాంలో తగిన గుర్తింపు**

వ్యవసాయంపై ఎంతో మక్కువ ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కదిరి వ్యవసాయ పరిస్న కేంద్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. పరిశోధన స్థానం అభివృద్ధి కోసం ఏకకాలంలో అప్పట్లోనే రూ 30. కోట్లు విడుదల చేశారు. ఆ నిధులను ఉపయోగించుకుని తీసుకువచ్చిన నూతన వంగడాలే ఇప్పుడు కదిరి వేరుశనగ రకాలుగా ప్రాచుర్యంలోకి వచ్చి దేశ వ్యాప్తంగా సాగులో ఉన్నాయి. దీన్ని ఆంధ్రప్రదేశ్ వేరుశనగ పరిశోధన సంస్థ(ఏపీజీఆర్ఐ)గా మార్చాలని ఆనాడు వైఎస్సార్ భావించారు. అయితే ఆయన అకాల మరణంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కదిరి ప్రాంత రైతాంగానికి మేలు జరిగేలా కృషి విజ్ఞాన కేంద్ర ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

**కదిరి పరిశోధన స్థానం నుంచి విడుదలైన వేరుశనగ రకాలు**

| విత్తనం | విడుదలైన సంవత్సరం | ఏ రకానికి చెందినది |
|---|---|---|
| కదిరి-1 | 1971 | తీగ రకం |
| కదిరి-2 | 1978 | తీగ రకం |
| కదిరి-3 | 1978 | తీగ రకం |
| వేమన | 1993 | గుత్తి రకం |
| కదిరి-4 | 1997 | గుత్తి రకం |
| కదిరి-5 | 2002 | గుత్తి రకం |
| కదిరి-6 | 2002 | గుత్తి రకం |
| కదిరి-7 | 2009 | తీగ రకం |
| కదిరి-8 | 2009 | తీగ రకం |
| కదిరి-9 | 2009 | గుత్తి రకం |
| కదిరి హరితాంధ్ర | 2010 | తీగ రకం |
| కదిరి అనంత | 2010 | గుత్తి రకం |
| కదిరి అమరావతి | 2016 | గుత్తి రకం |
| కదిరి చిత్రావతి | 2017 | గుత్తి రకం |
| కదిరి లేపాక్షి | 2020 | గుత్తి రకం |

**సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు**



రైతుల భాగస్వామ్యంతో ఏటా 500 ఎకరాల్లో విత్తనం ఉత్పత్తి చేస్తున్నాం. దేశ వ్యాప్తంగా ఏటా 10 వేల క్వింటాళ్ల మూల విత్తనం అవసరమైతే అందులో సగం కదిరి నుంచే సమకూరుస్తున్నాం. అందుకే 2022 సంవత్సరానికిను గాను విత్తనోత్పత్తిలో కదిరి పరిశోధన స్థానానికి జాతీయ స్థాయిలో అవార్డు దక్కింది. అందరి కృషి ఫలితంగా ఇది సాధ్యమైంది. కదిరి–6, కదిరి లేపాక్షి రకాలకు మంచి డిమాండ్ ఉంది. రైతులు పండించిన మూలవిత్తన వేరుశనగను కిలో రూ.95తో మేము కొనుగోలు చేస్తాం. మూడేళ్లకొకసారి ఈ ధర పెంచుతాం. –డా.సంపత్‌కుమార్, ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త

## పరిహారం త్వరగా చెల్లించండి

- 136 ఎకరాలకు రూ.18.27కోట్లు మంజూరు
- జాయింట్ కలెక్టర్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చేతన్

**పుట్టపర్తి అర్బన్:** వివిధ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమికి నష్ట పరిహారం త్వరగా చెల్లించాలని సంబంధిత అధికారులకు జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే, సర్వే, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో నిర్మిస్తున్న జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల కోసం సేకరించి అవార్డు పాస్ చేసిన భూమికి త్వరితగతిన పరిహారం చెల్లించాలన్నారు. ఇప్పటి దాకా జరుగుతున్న పనుల ప్రగతిపై పుట్టపర్తి, గోరంట్ల, బుక్కపట్నం, కొత్తచెరువు తహసీల్దార్లను ఆరా తీశారు. రహదారుల కోసం అటవీ భూములు సేకరించామని, అందుకు రెట్టింపు భూమిని అటవీ శాఖకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇక జిల్లాలో మొత్తం 136.62 హెక్టార్ల భూమిని సేకరించగా, రూ.18,27,50,030 పరిహారం మంజూరైందన్నారు. ఇందులో ఇప్పటి వరకూ 80.41 హెక్టార్లకు రూ.12.89 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. ఇతర జిల్లాలను కలుపుతూ ఏర్పాటు చేస్తున్న రహదారులు పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగవుతుందన్నారు. జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, ఎన్‌హెచ్ 42, ఎన్‌హెచ్ 544జీ, ఎన్‌హెచ్ 342, ఎన్‌హెచ్ 716 కోసం సేకరించిన భూమికి త్వరగా పరిహారం చెల్లించేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్లు కృషి చేయాలన్నారు. ఎక్కడైనా సమస్యలు వస్తే సంయమనంతో పరిష్కరించాలన్నారు. సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఎన్‌హెచ్ ఎస్ఈ మురళీమోహన్, డీఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి, సర్వే ఏడీ రామకృష్ణ, సూపరింటెండెంట్ బాలాజీ, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
- 419 మంది రైతులకు వ్యవసాయ పరికరాల అందజేత



రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

**పుట్టపర్తి అర్బన్:** వ్యవసాయంలో అన్ని విధాలా తోడుగా నిలిచి రైతును రాజు చేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం పుట్టపర్తి మండలంలో వాటర్‌షెడ్‌కు ఎంపికైన వెంగళమ్మ చెరువు, చెర్లోపల్లి, అమగొండపాళ్యం, బొంతలపల్లి గ్రామాల్లోని 419 మంది రైతులకు 'ప్రధానమంత్రి కృషి సించాయి యోజన' కింద జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ పనిముట్లు అందజేశారు. ఈ సందర్భంగా వెంగళమ్మ చెరువు ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతన్నకు ప్రభుత్వం ప్రతి అడుగులోనూ తోడుగా నిలుస్తోందని, ప్రకృతి కూడా సహకరిస్తున్నందున ప్రతి రైతూ వ్యవసాయ బాట పట్టాలన్నారు. ప్రస్తుతం రైతులకు రూ.59 లక్షల విలువైన స్ప్రింక్లర్లు, స్ప్రేయర్లు, స్ప్రింక్లర్ పైపులు, పీవీసీ పైపులు, చాఫ్ కట్టర్లు, టార్పాలిన్లు తదితర వాటిని అందజేశామన్నారు. అలాగే సాగునీటి లభ్యత పెంచేందుకు చెక్‌డ్యాంలు, నీటి కుంటలు, రాక్ ఫిల్ డ్యాంలు, కొండల్లో కందిత కందకాలు, చెక్‌వాల్, పర్క్యులేషన ట్యాంకులు నిర్మించనున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ రైతులు 10 శాతం, ఇతర రైతులు 20 శాతం వాటా చెల్లిస్తే సబ్సిడీతో పనిముట్లు అందజేస్తారన్నారు. ప్రతి పరికరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**గతంలో అంతా దోపిడీనే**

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు పల్లె, పరిటాల సునీతలు రూ.450 కోట్ల విలువైన రెయిన్‌గన్లు, పైపులు తీసుకువచ్చి కేవలం ఆ పార్టీ నాయకులకు అప్పజెప్పారని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. నిజమైన రైతులను నిలువునా మోసగించారన్నారు. ఇప్పటికీ ఆ పైపులు, స్ప్రింక్లర్లు, రెయిన్ గన్లు మిద్దెల మీద, చెట్ల కొమ్మల్లో వేళాడుతూ కనిపిస్తున్నాయన్నారు. వాటిని వెనక్కు ఇవ్వాలని అడిగిన వ్యవసాయాధికారులపై టీడీపీ నేతలు ఏకంగా దాడులకు తెగబడ్డారన్నారు.

**చెర్లోపల్లి చెరువును రిజర్వాయర్ చేస్తాం**

సీఎం వైఎస్ జగన్ పాలన పగ్గాలు తీసుకున్నప్పటి నుంచి ప్రకృతి కరుణిస్తోందన్నారు. వర్షాలు సకాలంలో కురవడంతో కుంటలు, చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయన్నారు. చెర్లోపల్లి చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చేస్తామని, మరో 15 నెలల్లో పైప్‌లైను పూర్తి కావచ్చన్నారు. అర్హులైన రైతులకు భూ పంపిణీ చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో సారవంతమైన భూములున్నాయని, కృష్ణా జలాలతో ఏటా మూడేసి పంటలు సాగు చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి వ్యవసాయం చేయాలని, పిల్లలకూ వ్యవసాయంలో మెలకువలు నేర్పాలన్నారు. అనంతరం వెంగళమ్మ చెరువు, అమగొండపాళ్యం, చెర్లోపల్లి, బొంతలపల్లి గ్రామాల రైతులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ హనుమంతరెడ్డి, ఏపీడీ కృష్ణచైతన్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటేష్, లీలావతి, రామచంద్ర, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, వాటర్‌షెడ్ చైర్మన్లు ఆనంద్, తిమ్మప్ప, సుజాత, అగ్రి అడ్వయిజరీ బోర్డు మండల చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ మల్లిఖార్జున, ఏపీడీ రఘునాథరెడ్డి, టీఏ భాస్కర్, పీఏ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక రుణ లక్ష్యం రూ.10.808 కోట్లు

- వ్యవసాయానికి రూ.7,353.92 కోట్లు
- సమన్వయంతో లక్ష్యాలు సాధించాలి
- బ్యాంకర్లు రుణ మంజూరు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు



2023-24 వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు, బ్యాంకర్లు

**పుట్టపర్తి అర్బన్:** జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఖరారైంది. 2023–24 సంవత్సరానికి సంబంధించి రుణ ప్రణాళిక లక్ష్యం రూ.10,808.35 కోట్లుగా నిర్ణయించినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో డీసీసీ/డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. రుణ ప్రణాళికలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ రంగాలకు రూ.1401.91 కోట్లకు గాను రూ.922.85 కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.4,994.01 కోట్ల లక్ష్యానికి మించి రూ.7,353.92 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే విద్యారంగానికి రూ.49.24 కోట్లకు గాను రూ.25.3 కోట్లు, హౌసింగ్ రుణాలకు సంబంధించి రూ.302.34 కోట్లకు గాను రూ.307.73 కోట్లు కేటాయించామన్నారు. వార్షిక ప్రణాళికలో ప్రధానంగా వ్యవసాయం, పరిశ్రమల స్థాపన, ఎంఎస్ఎంఈ రంగాలకు, విద్యకు ప్రాధాన్యం కల్పించామన్నారు.

**సమన్వయంతో పనిచేద్దాం.. ప్రగతి బాట పట్టిద్దాం**

బ్యాంకర్లు, ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాను ప్రగతి బాటలో నడిపించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. అలాగే రైతులు, పారిశ్రామిక వేత్తల అర్హతల మేరకు రుణాలు అందించాలని బ్యాంకర్లకు సూచించారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. అలాగే వెనుకబడిన ప్రాంతాల్లో మంచి మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు విద్యారుణాలు మంజూరు చేయాలని, జన సురక్ష కార్యక్రమంలో పురోగతి సాధించాలని కోరారు. స్టాండ్ అప్ ఇండియా రుణాలు మంజూరులో జాప్యం చేయరాదన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. పశు సంవర్ధక, మత్స్య శాఖకు సంబంధించి అధికారులు గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అర్హులు ఉంటే వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం 2023–24 వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాలను విడుదల చేశారు. అంతకుముందు 2022–23 వార్షిక ప్రణాళిక లక్ష్యం రూ.8,133.71 కోట్లు కాగా, రూ.10,985.97 కోట్ల ప్రగతి సాధించడంతో కలెక్టర్ బ్యాంకర్లు, అధికారులను అభినందించారు. సమావేశంలో ఎల్‌డీఎం కేవీ రమణకుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ రెహమాన్, ఏపీజీబీ ఆర్‌ఓ రవీంద్రరెడ్డి, ఎల్‌డీఓ వివేకానంద, ఫిక్కీ సభ్యులు రమణ, ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ తహసీల్దార్ మృతి



ప్రమాదస్థలంలో డీటీ కరుణాకర్ మృతదేహం



ప్రమాదంలో ధ్వంసమైన కారు

- కారు ముందు టైరు పంక్చర్
- అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వైనం
- డీటీ బెస్త కరుణాకర్ అక్కడికక్కడే మృతి
- భార్య, కుమారుడికి తీవ్ర గాయాలు



కరుణాకర్ (ఫైల్)

**పెద్దవడుగూరు/అమరాపురం :** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామ సమీపంలోని జాతీయ రహదారి (ఎన్‌హెచ్–44)పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ తహసీల్దార్ బెస్త కరుణాకర్ (48) మృతిచెందారు. ఈయన ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలో పని చేస్తున్నారు. ఇదే ప్రమాదంలో కరుణాకర్ భార్య వరలక్ష్మి, కుమారుడు పార్థుసాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. డిప్యూటీ తహసీల్దార్ బెస్త కరుణాకర్ అనంతపురం నగరంలో నివాసముంటున్నారు. ఆరోగ్యం బాగోలేక పోవడంతో బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి తన కారు (ఏపీ02 సీఏ 8568)లో కర్నూలుకు వెళ్లి అక్కడి ఆస్పత్రిలో చూపించుకున్నారు. తర్వాత అనంతపురానికి తిరుగు పయనమయ్యారు. మిడుతూరు వద్దకు రాగానేకారు ముందు టైరు పంక్చర్ అయ్యింది. దీంతో అదుపుతప్పి వేగంగా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారు ధ్వంసం కాగా.. డ్రైవింగ్ సీట్లో ఉన్న కరుణాకర్ బయటకు ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఎయిర్‌బ్యాగ్ తెరచుకున్నప్పటికీ వేగంగా బయటకు పడడం వల్ల ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఆయన పక్కనే కూర్చొన్న భార్య వరలక్ష్మి, వెనుక సీట్లో ఉన్న కుమారుడు పార్థుసాయి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి.. వివరాలు సేకరించారు. డీటీ కరుణాకర్ మృతికి అమరాపురం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దార్ సురేష్‌కుమార్ అనంతపురానికి వెళ్లారు.

# ఈత.. కారాదు కడుపుకోత

'అమ్మా ఆడుకునేందుకు వెళ్తున్నాం' అని ఇంట్లో చెప్పి బయటకు వెళ్తున్న పిల్లలు అనంత లోకాలకు చేరుకుంటున్నారు. వేసవిలో ఈత కొట్టాలన్న సరదా వారి నూరేళ్ల జీవితాన్ని నీట ముంచేస్తోంది. కన్నవారి ప్రేమను కన్నీటి పాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈత సరదాతో ఈ వేసవిలో 14 మంది మృత్యువాత పడినట్లుగా అధికారుల లెక్కలు స్పష్టం చేస్తుండగా... అనధికారికంగా ఈ లెక్క వందల్లోనే ఉంటుందని సమాచారం.

- ఇళ్ల ముందే కన్నుమూస్తున్న బిడ్డలు
- ప్రమాదాలకు నిలయంగా బావులు, చెరువులు
- వరుసగా చోటు చేసుకుంటున్న మరణాలు
- ప్రతి వేసవిలో పెరుగుతున్న ప్రమాదాలు



**హిందూపురం:** ఈత కొట్టడమంటే పిల్లలే కాదు పెద్దలకూ సరదానే. వేసవిలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందాలనుకుంటే ఈత ఒక్కటే మార్గం. దీంతో బావులు, చెరువులు, కుంటలు, స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. అయితే కుటుంబపెద్దలు కానీ, పర్యవేక్షకులు కాని లేకపోవడంతో నీటి లోతు తెలియక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

**ఇటీవల కొన్ని సంఘటనలు ఇలా..**

- గత నెల 23వ తేదీ చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్ (11) గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్ద ఈతకొడుతున్న వారిని గట్టుపై నుంచి చూస్తుండగా రాయి విరిగి నీటిలో పడింది. దీంతో అదుపు తప్పి నీటిలో పడిన శ్రీధర్ తలను రాయి బలంగా తాకడంతో నీట మునిగి మృతి చెందాడు.
- గత నెల 22వ తేదీ ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన సీఏ ద్వితీయ సంవత్సరం చదివే వెంకటేష్(22) ఈతకెళ్లి నీట మునిగి మృత్యువాత పడ్డాడు. బావి లోతును పసిగట్టకుండా అందులో దిగడంతో నీట మునిగి మృతి చెందాడు.
- మే 15న పెనుకొండ మండలం కొండంపల్లికి చెందిన 15 నెలల చిన్నారి ఆడుకుంటూ అదుపు తప్పి బావిలో పడి నీటి మునిగి చనిపోయాడు. పొలం పనులకు వెళ్లిన తల్లి పనుల్లో నిమగ్నమై ఉండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

**ఈత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- బావుల్లో ఈతకు వెళుతుంటే ముందుగా బావి చుట్టూ పైభాగంలో ప్రమాదకర పరిస్థితిని గమనించాలి
- టైరు, ట్యూబులు, వెదురు కర్రలు, సొరకాయ బూరలు, ఆయిల్ క్యాన్లు, తేలియాడే కర్రలు, స్విమ్మింగ్ ట్యూబులు తదితర వాటిల్లో పిల్లల బరువును బట్టి ఒకదానిని ఎంపిక చేసుకోవాలి.
- ఈతకు వాడే సాధనం, కట్టే తాళ్లను కచ్చితంగా ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి.
- అందరూ నీళ్లలో కాకుండా కనీసం ముగ్గురైనా బయట ఉండి నీటిలో ఉన్న వారిని నిశితంగా గమనిస్తూ ఉండాలి.
- ఈత నేర్చుకుంటున్న పిల్లల నడుము, భుజాలు పైకి వచ్చేలా పొడవైన తాడు కట్టి గట్టుపై ఉన్న వారు పట్టుకోవాలి.
- ఈత కొట్టే సమయంలో నీళ్లలో ఒకరినొకరు ముంచుకునే ఆటలు ఆడుకోరాదు.
- ఈత నేర్చుకునే వారు భయంతో ఇతరుల మెడ గట్టిగా పట్టుకోరాదు.
- అనుకోని ప్రమాదం జరిగితే వెంటనే బోర్లా పడుకోబెట్టి వీపుపై గట్టిగా చేతితో కొడుతూ దగ్గు వచ్చేలా చూడాలి. కాసేపటి తర్వాత వెల్లకిలా పడుకోబెట్టి తల పక్కకు తిప్పి పొట్టపై వత్తుతూ మధ్యలో ఛాతిపై ఒత్తిడి పెంచాలి.
- నీళ్లు తాగించరాదు. చేతులు, కాళ్లు రుద్ది శరీరంలో వేడి పుట్టించాలి. గాలి పీల్చుకునే వరకు ప్రమాద స్థలం వద్దే ప్రయత్నం చేయాలి.
- ప్రవాహం ఎక్కువగా ఉండే నీటిలో ఈత నేర్చుకోవడం, ఈత కొట్టడం ప్రమాదకరం.
- ఐదు అడుగుల కంటే ఎక్కువ లోతు ఉన్న నీళ్లలో ఈత కొట్టే సమయంలో పెద్దలు అక్కడే ఉండాలి.
- నీటి వనరుల వద్ద సెల్ఫీలు, సరదాగా ఫొటోల కోసం ప్రయత్నం చేయరాదు.

### జాగ్రత్తలు తీసుకోవాలి



ఈత అంటే అందరికీ సరదాగానే ఉంటుంది. అయితే లోతు ఎక్కువగా ఉన్న బావులు, చెరువులు, కుంటలతో పాటు నీటి ప్రవాహ వేగం ఎక్కువగా ఉన్న కాలువల్లో ఈతకెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్దలు పర్యవేక్షణలో నీటిలో తేలియాడే పరికరాలతో ఈత కొట్టడం అత్యంత సురక్షితం. శిక్షకుల పర్యవేక్షణ ఉన్న స్విమ్మింగ్ పూల్‌లోనే ఈత నేర్చుకోవాలి. బావులు, చెరువులు, కుంటల వద్ద నీటి లోతును తెలిపే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చు.

– శంకరప్రసాద్; ఫైర్ ఆఫీసర్

## క్లుప్తంగా

### బహిర్భూమికి వెళ్లి వ్యక్తి మృతి

**బత్తలపల్లి:** మండలంలోని అప్పరాచెరువు గ్రామానికి చెందిన ఆకులేటి పెద్దన్న (51) మంగళవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి మృతి చెందాడు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న ఆయన రాత్రి బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత సేపటికీ ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. గ్రామ శివారులో విగతజీవిగా పడి ఉండడంతో గుండె పోటుకు గురై మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు, కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. కాగా, మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### ట్రాక్టర్ ట్రాలీ బోల్తా.. యువకుడి మృతి



మృతుడు దివాకర్

**చిలమత్తూరు:** ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూలి పనులతో జీవనం సాగిస్తున్న చిలమత్తూరు మండలం కోడూరు ఎస్సీ కాలనీకి చెందిన దివాకర్ (21) బుధవారం ఉదయం మరో ఇద్దరు కూలీలతో కలసి కోడూరు మన్రో తోపులోని బట్టీ నుంచి ఇటుకలు ట్రాక్టర్‌లో లోడు చేసుకుని గోరంట్లకు వెళ్లాడు. అక్కడ ఇటుకలు అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణంలో కమ్మయ్యగారిపల్లికి చేరుకుని మడకలు లోడు చేసుకుని జాతీయ రహదారి మీదుగా మన్రో తోపునకు బయలుదేరారు. తోపు సమీపంలో జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డులోకి ప్రవేశించేటప్పుడు ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడింది. ఘటనలో దివాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు కూలీలను 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### దాడితోటలో పట్టపగలే భారీ చోరీ

**తాడిమర్రి:** మండలంలోని దాడితోటలో బుధవారం ఉదయం ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రైతు బొజ్జె చిన్నసుబ్బారెడ్డి వ్యవసాయంతో పాటు ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలు బాడుగకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం తన చిన్న కుమారుడు విజయ్‌కుమార్‌రెడ్డితో కలసి పనిమీద అనంతపురం వెళ్లాడు. అతని భార్య రమణమ్మ 9 గంటలకు పనిపై పక్కింటికి వెళ్లింది. ఆ సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి ముందు ఉంచిన గడ్డపారతో తలుపులు బద్దలు కొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి పది తులాల బంగారు నగలు, రూ.3 లక్షల నగదు అపహరించుకెళ్లారు. అరగంట తర్వాత ఇంటికి చేరుకున్న రమణమ్మ అప్పటికే తలుపులు బద్దలై ఉండడం గమనించి ఆందోళనతో లోపలకు వెళ్లి పరిశీలించింది. బీరువాలోని బంగారు, నగదు కనిపించకపోవడంతో వెంటనే భర్తకు సమాచారం అందజేసింది. విషయం తెలుసుకున్న సీఐ కంబగిరి రాముడు, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి ఆగంతకుల వేలిముద్రలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## 'అప్పర్ భద్రతో సీమకు ముప్పు'

**గుంతకల్లు:** కర్ణాటకలో చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టు పనులు పూర్తయితే రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కర్ణాటకలో చేపట్టిన అప్పర్ భద్ర, నవలి ప్రాజెక్టుల ద్వారా రాయలసీమ ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందకుండా పోతుందన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 150 అడుగుల ఎత్తులో పోలవరం ప్రాజెక్ట్‌ను నిర్మించాలని డిజైన్ చేస్తే దానిని ప్రస్తుతం 135 అడుగుల ఎత్తుకు కేంద్ర ప్రభుత్వ కుదించడం దారుణమన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకూ రైతు గర్జన పేరిట ప్రచార జాతాను చేపట్టనున్నట్లు తెలిపారు. 21న కలెక్టరేట్ వద్ద రైతు గర్జనపై నిరసన కార్యక్రమాలు ఉంటాయన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ జాఫర్, బి.గోవిందు, ఎం.వీరభద్రస్వామి, రాజేష్‌గౌడ్, నాయకులు రాము, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు నేడు ఎన్నిక

**అనంతపురం సిటీ:** ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు గురువారం ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు అంతా సిద్ధం చేశారు. బత్తలపల్లి ఎంపీపీగా పని చేసిన గుర్రం వనజ తన పదవికి, చెన్నేకొత్తపల్లి వైస్ ఎంపీపీ శ్రీశైలం ప్రవీణ రాజీనామా చేయడంతో ఆయా స్థానాలకు ఎన్నిక నిర్వహించనున్నారు. అలాగే రాయదుర్గం వైస్ ఎంపీపీ సత్యనారాయణ మృత్యువాత పడడంతో అక్కడ ఎన్నిక అనివార్యమైంది. విడపనకల్లు ఎంపీపీగా కరణం పుష్ప ఎన్నిక కావడంతో ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించనున్నారు. తనకల్లు మండల కో–ఆప్షన్ సభ్యుడు మరణంతో ఖాళీగా ఏర్పడ్డ ఆ స్థానానికీ అధికారులు ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయా మండల పరిషత్ అధికారులు పూర్తి చేశారు.

## నెల రోజుల క్రితం వివాహం.. అప్పుడే విషాదం

- కడుపు నొప్పి తాళలేక భర్త ఆత్మహత్య
- జీర్ణించుకోలేక భార్య ఆత్మహత్యాయత్నం



మనోజ్‌కుమార్ (ఫైల్)

**గుడిబండ:** నెల రోజుల క్రితం పెళ్లి వేడుక జరిగిన ఇంట విషాదం నెలకొంది. కడుపు నొప్పి తాళలేక నవ వరుడు ఆత్మహత్య చేసుకోగా... భర్త మృతిని జీర్ణించుకోలేక నవ వధువూ ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం బీటీపల్లి నివాసి మనోజ్‌కుమార్ (24)కు నెల రోజుల క్రితం వీరజ్జనపల్లికి చెందిన శిల్పతో వివాహమైంది. నవ దంపతులు ఎంతో అన్యోన్యంగా జీవించేవారు. అయితే కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న మనోజ్ కుమార్.. బుధవారం ఉదయం కడుపు నొప్పి తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన శిల్ప.. భర్త లేని జీవితం తనకూ వద్దంటూ అక్కడే ఉన్న క్రిమి సంహారక మందుతాగింది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుని తండ్రి హనుమంతరాయప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### విద్యార్థి బలవన్మరణం



గౌతమి

**పరిగి:** సప్లిమెంటరీ పరీక్షల్లోనూ ఫెయిల్ అవుతాననే భయంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పరిగి మండలం కొడిగెనహళ్లి ఎస్సీ కాలనీకి చెందిన జయమ్మ కుమార్తె గౌతమి (15) ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మేథమేటిక్స్ సబ్జెక్‌లో ఫెయిల్ అయింది. దీంతో మంగళవారం సప్లిమెంటరీ పరీక్ష రాసి సాయంత్రం ఇంటికి చేరుకుంది. అప్పటికే ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తల్లి చీరతో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాలువపల్లి వద్ద ఆకుకూరలు అమ్మడానికి వెళ్లిన తల్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తలుపు లోపల గొళ్లెం వేసినట్లు గమనించి కుమార్తెను పిలిచింది. ఎంతసేపటికీ తలుపు తీయకపోవడంతో కిటికీలో నుంచి లోపలకు చూడగా అప్పటికే ఉరికి వేలాడుతున్న కుమార్తె మృతదేహం కనిపించింది. దీంతో గట్టిగా కేకలు వేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో వారు అక్కడకు చేరుకుని తలుపులు బద్దలుగొట్టి లోపలకు వెళ్లి గౌతమిని కిందకు దించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్య చేసుకునే ముందు గౌతమి రాసి పెట్టిన మరణ వాగ్మూలాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో 'తన చావుకు ఎవరూ కారణం కాదని, పరీక్షల్లో మళ్లీ ఫెయిలవుతాననే మోననే భయంతో తన తల్లి బాధపడకూడదంటూ ఆత్మహత్య చేసుకుంటున్నా' అటంటూ పేర్కొంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## ఎండోమెంట్ ఏసీగా ఆదిశేషు నాయుడు

**అనంతపురం కల్చరల్:** జిల్లా ఎండోమెంటు సహాయ కమిషనర్‌గా ఆదిశేషునాయుడు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో పనిచేసిన రామాంజినేయులను కర్నూలు జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రామాంజినేయులు నుంచి ఆదిశేషు నాయుడు బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలు ఆలయాల ఈఓలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రామాంజినేయులను ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. జిల్లాలో ఎండోమెంట్ పరంగా ఎన్నో సమస్యలను సమర్థవంతంగా రామాంజినేయులు పరిష్కరించారని కొనియాడారు. కార్యక్రమంలో ఈఓలు అక్కిరెడ్డి, బాబు, బీఆర్ వెంకటేశులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

## వీఆర్‌కు కానిస్టేబుల్

**హిందూపురం:** స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సురేష్‌బాబును వీఆర్‌కు పంపుతూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ సురేష్‌బాబుపై భార్య శిరీషా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో సురేష్‌బాబు అక్కడే విధుల్లో ఉంటే కేసును పక్కదారి పట్టించే అవకాశం ఉండడంతో అతన్ని వీఆర్‌కు పంపినట్లుగా తెలిసింది.

## వీఆర్వో ఆత్మహత్య



శ్రీనివాసులు (ఫైల్)

**లేపాక్షి:** మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన వీఆర్వో తలారి శ్రీనివాసులు(57) ఆత్మహత్య చేసుకున్నారు. ప్రస్తుతం రొద్దం మండలం నారనాగేపల్లిలో ఆయన పనిచేస్తున్నారు. రెండు రోజులు క్రితం స్వగ్రామానికి భార్యతో కలసి వచ్చిన ఆయన బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు వేసుకుని లోపల గడి పెట్టుకున్నారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న భార్య జయలక్ష్మి స్థానికుల సాయంతో తలుపులు తీసి చూడగా ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న శ్రీనివాసులను గమనించి బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తెలిసిన వ్యక్తి అభ్యర్థన మేరకు ఆయన తీసుకున్న రూ.10 లక్షల రుణానికి తన భర్త జామీను వేశాడని, చివరకు అప్పు తీసుకున్న వ్యక్తి రుణం చెల్లించకపోవడంతో శ్రీనివాసులు జీతం నుంచి జమ కావడమే కాక ప్రతి నెలా డిమాండ్ నోటీసు ఇంటికి వచ్చేదని గుర్తు చేసింది. దీంతో తన భర్త మానసిక క్షోభకు గురయ్యారని, చివరికి తినడానికి తిండిలేక, ఇంటి బాడుగ కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు వివరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## సీఓల బదిలీలు

**అనంతపురం క్రైం:** నగర పాలక సంస్థ మెప్మా విభాగంలో పనిచేస్తున్న కొందరు కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓ) బదిలీ అయ్యారు. ఈ మేరకు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సీఓ లక్ష్మీనారాయణను ధర్మవరం మునిసిపాలిటీకి, నాగపల్లవిని గుంతకల్లు మునిసిపాలిటీకి, ఎస్.దూద్‌పీరాను పుట్టపర్తి మునిసిపాలిటీకి బదిలీ చేశారు. దీంతో వీరిని నగర పాలక సంస్థ కమిషనర్ బుధవారం రిలీవ్ చేశారు. అలాగే కళ్యాణదుర్గం మునిసిపాలిటీ నుంచి కళావతి, గుంతకల్లు మునిసిపాలిటీ నుంచి పార్వతి బదిలీపై నగరపాలక సంస్థకు వచ్చారు. వీరిద్దరూ కమిషనర్ రమణారెడ్డి వద్ద రిపోర్టు చేసుకున్నారు.

## ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ఐఈఆర్పీలు

**రాప్తాడు రూరల్:** ఉమ్మడి జిల్లా సమగ్ర శిక్ష పరిధిలో పని చేస్తున్న ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్‌లలో(ఐఈఆర్పీ) ఎవరైనా అనారోగ్యాలతో బాధపడుతుంటే ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద సాధారణ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు సమగ్ర శిక్ష ఏపీఓ ఎం.సాయిరామ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను సమగ్ర బ్లాగ్‌స్పాట్‌లో ఉంచారు. దరఖాస్తులను గురు, శుక్రవారాల్లో సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలి. అందిన దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీ ద్వారా పరిశీలన చేయిస్తారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

**ముదిగుబ్బ:** మండలంలోని టీఎస్ పాళ్యం అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 19 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ కంబగిరి రాముడు, ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. బుధవారం ఉదయం అందిన సమాచారం మేరకు అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టగా పేకాట ఆడుతూ నిందితులు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.1,20,350 నగదు స్వాధీనం చేసుకుని, రెండు జీపులు, ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు వివరించారు.

## ఏడు సెల్‌ఫోన్లు, రూ.49 వేలు చోరీ

**ఓడీ చెరువు:** మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సంతలో ఏడు సెల్‌ఫోన్లు, రూ.49 వేలను దుండగుడు అపహరించుకెళ్లాడు. బాధితులు తెలిపిన మేరకు.. వారపు సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌బీఐ పాయింట్‌లో పని చేస్తున్న శీను ప్యాంటు జేబులో ఉంచుకున్న రూ.49 వేలు నగదు దొంగలించి దొంగ పరుగు తీశాడు. గమనించిన శీను ఆ దుండగుడిని పట్టుకునేందుకు ప్రయత్నించినప్పుడు సెల్‌ఫోన్‌ను శీనుపైకి విసిరి తప్పించుకెళ్లాడు. అంతలో పలువురు తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఎస్‌ఐ గోపి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## విద్యుత్ షాక్‌తో బాలిక మృతి



ఐశ్వర్య(ఫైల్)

**కదిరి:** స్థానిక వైఎస్సార్ నగర్‌లో బుధవారం విద్యుత్ తీగ తగిలి ఐశ్వర్య(12) మృతి చెందింది. సీఐ తమ్మిశెట్టి మధు తెలిపిన మేరకు... వైఎస్సార్ నగర్‌లో మురుగు కాలువపై తాత్కాలికంగా ఇల్లు నిర్మించుకున్న గంగరత్నమ్మ, కరుణాకర్ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఐశ్వర్య ఉన్నారు. లేపాక్షి గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బాలిక వేసవి సెలవులు కారణంగా ఇంటి వద్దే ఉంటోంది. తల్లి చుట్టుపక్కల ఇళ్లలో పాచి పనులు చేసుకుంటుండగా తండ్రి కూలి పనులకు వెళుతుంటాడు. ఐశ్వర్య ఇంటి పక్కనే ఉన్న బంధువులు ఇంటికి పై కప్పు బదులు ప్లాస్టిక్ పట్ట వేసుకున్నారు. అది కాస్త గాలికి పక్కకు జరగడంతో వారి కోరిక మేరకు ఐశ్వర్య ఆ ప్లాస్టిక్ పట్టను సరి చేస్తుండగా ఇంటి గోడపైగా వెళుతున్న 33 కేవీ విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## విషపూరిత ద్రావకం తాగి వివాహిత మృతి

**ముదిగుబ్బ:** మండలంలోని నల్లచెర్లోపల్లి గ్రామానికి చెందిన భారతి (33) బుధవారం విషపూరిత ద్రావకం తాగి ఆత్మహత్య చేసుకుంది. కొన్నేళ్ల క్రితం కడప జిల్లా రైల్వే కొండాపురం నుంచి వచ్చి స్థిరపడిన భారతికి అనంతపురం నగరానికి చెందిన రమణతో వివాహమైంది. సంతానం కలుగలేదని మనస్తాపంతో పుట్టింటికి వచ్చిన ఆమె బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యాయత్నం చేసింది. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే అనంతపురం తరలించారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## యువతి అదృశ్యంపై కేసు నమోదు

**హిందూపురం:** పట్టణంలోని హస్నాబాద్‌కు చెందిన నర్సింగ్ విద్యార్థిని కావ్య రెండు రోజులుగా కనిపించడం లేదంటూ తల్లి రాధ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పెయింటింగ్ వృత్తితో జీవిస్తున్న రమేష్, ఫిజియోథెరపీ సెంటర్‌లో పనిచేస్తున్న రాధ దంపతులకు ఇద్దరు సంతానం కాగా, కావ్యను నర్సింగ్ చదివిస్తున్నారు. కొడుకు ఇంటర్ చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం నర్సింగ్ కాలేజి వద్దకు వెళ్లిన కావ్య తిరిగి ఇంటికి చేరుకోలేదు. స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## టీటీసీ–2023 థియరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

**రాప్తాడురూరల్:** టీటీసీ (టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్)–2023 (లోయర్ గ్రేడ్) థియరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టులో ఈ పరీక్షలు ఉంటాయి. 42 రోజుల శిక్షణ కోర్సు చేస్తున్న అభ్యర్థులతో పాటు గతంలో ఈ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారు ఈ నెల 20వ తేదీ లోపు www.bre.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా రూ.150 రుసుం చెల్లించి, పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ. 50 అపరాధ రుసుంతో ఈ నెల 29వ తేదీ వరకు గడువు ఉంటుంది. మ్యానువల్ చలానాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబడవు.